
విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
బుధవారం 14 జూలై 2026

# బిల్డింగ్ లేదు ఏమి లేదు పోండి..పోండి బయటికి

- మండల కేంద్రంలో ఆరు బయట అంగన్వాడీ
- చిన్నపిల్లల అలనా పాలన అంతా ఆరు బయటే
- అదనపు బిల్డింగులు కేటాయించడానికి ఎంపీడీవో ససేమిరా
- బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్న సిడిపిఓ, సూపర్వైజర్



కూడేరు, జులై 14 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రంలో (ఐసిడిఎస్) మూడవ సెంటరు కు బిల్డింగు లేక నానా అవస్థలు పడుతూ అంగన్వాడి ఆలనా పాలనా అంతా ఆరుబయటే నిర్వహిస్తా ఉన్నారు. దాంతో చిన్నపిల్లలు తల్లిదండ్రులు అంగన్వాడీ కార్యకర్త,కలిసి మండల కేంద్రంలోని పంచాయతీ పరిధిలోని నిరుపయోగంగా ఉన్నటువంటి అదనపు బిల్డింగులు ఉన్నాయని వాటిని తాత్కాలికంగా చిన్నపిల్లల అంగన్వాడి సెంటర్ కు కేటాయించాలని ఎంపీడీవోని అభ్యర్థిస్తే ఎంపీడీవో మాత్రం రాజకీయ నాయకులను అంటగాగుతూ వారిని భుజాన మోస్తూ వారి ఆదేశాలను మేరకు "పోండి... పోండి బిల్డింగ్ లేదు ఏవి... లేదు అంటూ అంగన్వాడి టీచర్, ఆయాల ఆక్రందనను తిరస్కరించినట్లు తెలుస్తోంది. దాంతో దిక్కుతోచని అంగన్వాడి కార్యకర్త, ఆయా, ఆరుబయట అంగన్వాడీ స్కూలు ను నిర్వహిస్తూ ఉన్నారని చిన్నపిల్లల తల్లిదండ్రులు మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసస్తున్నారు. మండల అభివృద్ధిని ఆకాంక్షించాల్సిన ఎంపీడీవో ఎంపీడీవో కాంప్లెక్స్ చివరిలో ఉన్నటువంటి ప్రభుత్వ ఆస్తులను (రూములను) 23-5-2026 న ఎవరి ఆదేశాలు మేరకు పడగొట్టారని ఈరోజు వాటిని కూల్చకుండా ఉండి ఉండింటే.. ఏదో ఒక రూమ్ కి మరమ్మతులు చేయించి అంగన్వాడి సెంటర్ అక్కడ నిర్వహించుకోవడానికి ఆస్కారం ఉండేదని అంగన్వాడి టీచర్ ఆయా వాపోయారు.అంగన్వాడి సెంటర్ కి పంచాయతీ పరిధిలోని ఖాళీగా ఉన్నటువంటి బిల్డింగును కేటాయించాలని అభ్యర్థిస్తే ఎంపీడీవో తిరస్కరించడం చాలా బాధాకరమని వారు అన్నారు. మరి అంగన్వాడీ కేంద్రానికి ఎంపీడీవో గా మా ప్రతిపాదనను మీరు తిరస్కరించినప్పుడు మొన్న నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి వెలుగు కార్యాలయాన్ని ఎలా వాడుకుంటారని వారు ప్రశ్నించారు. అన్ని శాఖల మీద రాజకీయ నాయకులు (పెద్దల) పేర్లు చెప్పి పెత్తనం చెలయించినప్పుడు వారి బాటలోనే పయనించే మీరు అంగన్వాడి సెంటర్ కి రూమ్ కేటాయించాలని అభ్యర్థిస్తే మాత్రం పోండి... పోండి పంచాయతీ పరిధిలో నిరుపయోగంగా ఉన్న అదనపు బిల్డింగులు మీకు ఇవ్వం అంటూ మా అభ్యర్థులను తిరస్కరించడం ఏంటని వారు ప్రశ్నించారు. మేము కూడా ప్రభుత్వ ద్వారానే చిన్నపిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు పని చేస్తున్నామని మా అభ్యర్థులను మీరు ఎలా తిరస్కరిస్తారని వారు ఎంపీడీవోను ప్రశ్నించారు. మీరు కూడా అన్ని పార్టీల ప్రజా ప్రతినిధుల సమన్వయంతోనే ఎంపీడీవో కార్యాలయంలో బిల్డింగ్ స్లాబ్ నుండి సిమెంట్ పెచ్చులు ఊడి నెత్తిమీద పడుతున్నాయంటూ అత్యుత్సాహంతో ఎంతో ఆర్భాటంగా అప్పటికప్పుడు హడావుడి చేసి లక్షల లక్షలు రూపాయలు వెచ్చించి బిల్డింగ్ మరమ్మతులు చేపట్టారని కానీ మండల కేంద్రంలోని పంచాయతీ పరిధిలో నిరుపయోగంగా అదనపు బిల్డింగులు ఉన్నప్పటికీ చిన్నపిల్లల భవిష్యత్తు కోసం బిల్డింగును కేటాయించేందుకు మరి ఎందుకు తిరస్కరిస్తున్నారని వారు ప్రశ్నించారు. ఇదిలా ఉండగా చిన్నపిల్లలతో ఆరు బయట అంగన్వాడి విధులు నిర్వహిస్తా ఉంటే కనీసం ప్రాజెక్ట్ డైరెక్టర్ కానీ లేదా సిడిపిఓ గాని లేదా పూర్తి గా పర్యవేక్షణ లేకుండ పోయిందని మరి మండల కేంద్రంలో సూపర్వైజర్ కు చిన్నపిల్లల అలనా పాలన పర్యవేక్షణ అసలు పట్టడం లేదని మూడో సెంటర్ కు బిల్డింగ్ లేని విషయం సూపర్వైజర్ గా మీకు తెలిసినప్పటికీ ఎందుకు మీరు సర్వసభ్య సమావేశంలో ఎందుకు అడగలేకపోయారని సూపర్వైజర్ ను పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. సూపర్వైజర్ నిర్వాకం వల్లే ఇలా ఆరు బయట అంగన్వాడి అలనా పాలన చూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు

## ప్రాణ త్యాగం చేసైనా... ప్రెస్ క్లబ్ ను కాపాడుకుంటాం!



అనంతపురము , జులై 14 (అనంత ప్రభ)

వందలాది మంది జర్నలిస్టుల జీవితాలతో ముడిపడి ఉన్న అనంతపురము ప్రెస్ క్లబ్ ను ప్రాణత్యాగం చేసైనా కాపాడుకుంటామని పలువురు దీక్షలో కూర్చున్న జర్నలిస్టులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అనంతపురం ప్రెస్ క్లబ్ కు తక్షణం ఎన్నికలు నిర్వహించాలనే ప్రధాన డిమాండ్ తో ప్రెస్ క్లబ్ ఎదుట జర్నలిస్టులు చేపట్టిన రిలే దీక్ష మంగళవారం మూడో రోజు కు చేరుకుంది. ప్రజాస్వామ్య బద్ధంగా రాజకీయ పార్టీలకు, జర్నలిస్టు యూనియన్లకు అతీతంగా పలువురు సీనియర్ జర్నలిస్టులు స్వచ్ఛందంగా చేస్తున్న ఈ దీక్షలను చూసి ఎందరో ప్రజాస్వామ్యవాదులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారు. అయితే జిల్లా అధికార యంత్రాంగం నుండి గాని, ఎన్నికల కోసమే గత ఆరునెలల కిందట ఏర్పాటైన తాత్కాలిక హడ్ హక్ కమిటీ సభ్యుల నుండి గాని దీక్షపరులకు ఎలాంటి స్పష్టమైన హామీలేని కారణంగా ఆందోళన కార్యక్రమం మరింత ఉధృతం చేస్తున్నట్లు ప్రకటించారు. మూడవరోజు దీక్షలకు మద్దతు తెలిపిన వారిలో.... మద్దతు తెలిపిన వారిలో.. జై భీమ్ రామాంజనేయులు, సురేష్, ఎస్సీ జన సంఘం రాష్ట్ర నాయకుడు దాసగారి కుల్లాయప్ప, ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు సాకే హరి, మాల మహానాడు అధ్యక్షుడు సుగమంచి శ్రీనివాసులు, సామాజిక కార్యకర్త డిస్కవర్ అనిల్ కుమార్ రెడ్డి, ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపకులు కేపీ రాజు, శంకర్ రెడ్డి, బేడ బుడగ జంగం రాష్ట్ర కార్యదర్శి సిరిశాల అంజి, గిరిజన నాయకులు బాబు నాయక్, ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు పవన్ శ్రీధర్ రమణ, ఏఐఎస్ బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పృధ్వి, మద్దెల చెరువు మల్లీ, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి, ఇన్సాఫ్ అధ్యక్షుడు జాఫర్, కూడేరు మాజీ ఎంపీపీ బ్రహ్మయ్య తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలియజేశారు రేపటి నుంచే ఆమరణ నిరాహార దీక్ష అనంతపురం ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ఏకైక కారణమైన ఎన్నికలు నిర్వహించాలనే ప్రధాన డిమాండ్ తో నేటి నుంచి(15-7-2026) ఆమరణ నిరాహార దీక్షలకు పోతున్నట్లు దీక్షలో కూర్చున్న పలువురు సీనియర్ జర్నలిస్టులు చెరుకూరి రామాంజనేయులు, రవి, రామ్మూర్తి, హరి, భాస్కర్ తదితరులు తమ స్పష్టమైన వైఖరి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, కుల ప్రజా సంఘాల నాయకులు మద్దతుగా నిలిచారు.

## మీకు సహకరించిన మీడియాపై నిందలు వేయడం సరికాదు..టీడీపీ నాయకులు



కళ్యాణదుర్గం, జులై 14 (అనంత ప్రభ)

కళ్యాణదుర్గం గతంలో తెలుగుదేశం పార్టీలో ఉన్న రోజుల్లో సహకరించిన మీడియా వారిపై నేడు పచ్చ మీడియా అంటూ నిందలు వేయడం సరికాదని బ్రహ్మసముద్రం మండల పార్టీ అధ్యక్షుడు పాలబండ్ల శ్రీరాములు అన్నారు..నేడు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారి సూచనలతో ప్రజావేదిక నందు బ్రహ్మసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పాలబండ్ల శ్రీరాములు, కుందుర్పి మండల పార్టీ అధ్యక్షులు ధనుంజయ, శెట్టూరు మండల పార్టీ అధ్యక్షులు టీఆర్ తిప్పేస్వామి, క్లస్టర్ ఇంచార్జులు ఉమేష్ గౌడ, బోగేష్ చౌదరిలు మీడియా సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా రాజకీయంలో ఉన్నాము అని చెప్పుకునే నీకు తెలుగుదేశం పార్టీ అనేక పదవులు ఇచ్చి గౌరవం కల్పించిందని ఉమా మహేశ్వర నాయుడు గారు మీకు సింగిల్ విండో అధ్యక్షుడిగా, మీ అమ్మకు ఎంపీపీ, జడ్పీటీసీగా అవకాశం ఇచ్చి జిల్లా పరిషత్ చైర్మన్ గ చేయడం మీకు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పదవి, 2019లో మీకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చినా నేడు వైసీపీ పార్టీలో చేరి పదవులు ఇచ్చిన పార్టీని నిందించడం కరెక్ట్ కాదని, అలాగే మీకు అనేక రకాలుగా సహకరించిన మీడియాను దూశించడం సబబు కాదన్నారు. మీ తమ్ముడికి రాజకీయాలలో లేదని చెప్పడం అదే 2019లో మీకు టికెట్ ఇచ్చినప్పుడు ఇక్కడ పనిచేసింది మీ తమ్ముడు కాదా..? ఎన్నికల అనంతరం మేము గెలుస్తాం అని చెప్పి ముందుగా అన్ని శాఖల అధికారులను పిలిపించి ఏ ఒక్క బిల్లులు చెల్లించకూడదని చెప్పింది మీ సోదరుడు ఇంద్రసేన కాదని నిరూపించగలరా..? ప్రస్తుతం ప్రశ్న రావణ్ పేరుతో నడుస్తున్న యూట్యూబ్ ఛానల్, ఆ ఛానల్ సీఈఓగా చెప్పబడుతున్న గమన, మీ తమ్ముడు మధ్య ఎలాంటి సంబంధాలు ఉన్నాయి..?వారి మధ్య ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవని మీరు నిరూపించగలరా..? అంటూ ప్రశ్నించారు..టీఆర్ తిప్పేస్వామి మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీతో పాటే పనిచేసాము మీకున్న అలవాట్లు, అవకాశ వాద రాజకీయాలు మాకు తెలుసు.. మీరు తెలుగుదేశం పార్టీలో అనేక పదవులు అనుభవించి నేడు పార్టీపై నిందలు వేయడం తగదు..2024లో నాకే టికెట్ వస్తుంది అందుకు నాతమ్ముడు ఇంద్రసేన సీఎమ్ కార్యాలయంలో అలాగే పార్టీ పెద్దలతో మాట్లాడుతున్నాడు, నాకే కాదు మరో పదిమందికి నాతమ్ముడు టికెట్లు ఇప్పించే స్థాయిలో ఉన్నాడు అని చెప్పింది మరిచిపోయావా..? నేడు టీడీపీలో టికెట్ రాకపోవడంతో నీ తమ్ముడి మాటలు విని వైసీపీలో చేరావు..టీడీపీ పార్టీని కానీ, అభివృద్ధి చేస్తున్న మా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారిపై అసత్య ఆరోపణలు, అవాస్తవాలు మాట్లాడితే ఉమామహేశ్వర నాయుడు కావచ్చు, నీ తమ్ముడు కావచ్చు, ఏ వైసీపీ నాయకుడైనా సరే ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు..ధనుంజయ మాట్లాడుతూ ఉమామహేశ్వర నాయుడు పదే పదే పచ్చ మీడియా అనడం సబబు కాదని, కళ్యాణదుర్గంలో మీకు అదే మీడియా ఎంతగా సహకరించిందో తెలియదా..? మీ తమ్ముడు 15 ఏళ్ల నుంచి రాజకీయాల్లో లేడు అంటున్నావ్ కళ్యాణదుర్గం సుబేధార్ చేరువు విషయంలో మీ తమ్ముడు హైకోర్టు నుంచి స్టే తెచ్చి పరోక్షంగా రాజకీయంగా మీకు సహకరించిన విషయం అందరికి తెలుసు..కేవలం మా ఎమ్మెల్యే గారిపై నిందలు వేయడం కరెక్ట్ కాదని,ప్రశ్న రావణ్ విషయంలో నిజా నిజాలు తెలుసుకునేందుకు పోలీసులు మీతమ్ముడు ఇంద్రసేనను, గమన అనే యూట్యూబర్ ను విచారించారని తిరిగి ఈ నెల 17న తిరిగి విచారణకు పిలిచారని ఎవరు సహకరించారు అనేది అక్కడ తెలుతుందని పేర్కొన్నారు.

## పెద్దవడుగూరు మండలానికి గర్వకారణమైన విద్యార్థిని కె. జయశ్రీకి అభినందనలు -- గురువులకు ఘన సన్మానం



గుత్తి, జులై 14 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ )లో చదువుతున్న విద్యార్థిని కె. జయశ్రీ (తండ్రి: ఆచారి) 2025--2026 ఎస్ఎస్సీ పరీక్షల్లో 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించి మండలానికే గర్వకారణంగా నిలిచింది.

ఈ అరుదైన విజయాన్ని గుర్తిస్తూ, ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారి చేతుల మీదుగా అవార్డు అందుకున్న విద్యార్థిని కె. జయశ్రీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా విద్యార్థిని తండ్రి ఆచారి గారిని శాలువాతో ఘనంగా సన్మానించి కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు.

అదేవిధంగా, జయశ్రీని రాష్ట్ర స్థాయి ప్రతిభావంతురాలిగా తీర్చిదిద్దిన గురువులను సత్కరించారు. "గురువు లేకపోతే విద్య లేదు; విద్యతోనే ఉన్నత విజయాలు సాధ్యమవుతాయి" అనే సందేశంతో కేజీబీవీ ప్రిన్సిపాల్ ఉషా మేడం, ఎస్. ఐ.రాఘవేంద్రప్ప గారు, ఎంఈఓలు గురు ప్రసాద్ గారు, రాముడు సార్ గారిని సాకే గోవింద్ గారి చేతుల మీదుగా శాలువాలు కప్పి ఘనంగా సన్మానించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పెనుగొండ చంద్రయ్య గుత్తి మార్కెట్ శీన మిడుతూరు రామకృష్ణ

విద్యార్థుల విజయాలను ప్రోత్సహించడం, గురువుల సేవలను గుర్తించి గౌరవించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు.

## ధర్మవరంలో జూలై 20న శ్రీ జగన్నాథ రథయాత్రలో పాల్గొననున్న మంత్రి సత్యకుమార్ యాదవ్



ధర్మవరం, జులై 14 (అనంత ప్రభ)

శ్రీ జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో ఉండాలని ధర్మవరం హరీష్ బాబు సూచించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ గారి సూచనల మేరకు మంగళవారం ఆయన నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు ధర్మవరం ఇస్కాన్ మందిరాన్ని సందర్శించి, ఈ నెల 20వ తేదీ సోమవారం నిర్వహించనున్న శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ ధర్మవరం బలిజ కళ్యాణ మండపం గురువులు, ఆలయ నిర్వాహకులతో సమావేశమైన హరీష్ బాబు, రథయాత్ర నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశంపై సమగ్రంగా చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ఆధ్యాత్మిక వాతావరణానికి తగిన రీతిలో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జూలై 20వ తేదీ సోమవారం ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజలు, అనంతరం తులసి పూజ, ఉదయం 7 గంటలకు శ్రీ జగన్నాథ స్వామి, బలభద్ర స్వామి, సుభద్ర అమ్మవార్ల రథప్రవేశ కార్యక్రమం, మధ్యాహ్నం 3 గంటలకు రథయాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి కార్యక్రమం నిర్ణీత సమయానికి నిర్వహించేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే వేలాదిమంది భక్తులు పాల్గొనే ఈ మహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని రథయాత్ర జరిగే మార్గమంతా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఆర్టీసీ బస్ స్టాండ్ నుండి ప్రారంభమయ్యే రథయాత్ర పాత శ్రీరాముల సర్కిల్, కళాజ్యోతి సర్కిల్, అంజుమన్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, తిరిగి కళాజ్యోతి సర్కిల్, పాండురంగ స్వామి దేవాలయం, గాంధీనగర్ ప్రధాన వీధుల మీదుగా బలిజ కళ్యాణ మండపం వరకు కొనసాగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యం, ప్రసాద పంపిణీ, పరిశుభ్రత, వైద్య సేవలు, అత్యవసర సహాయక బృందాలు, స్వచ్ఛంద సేవకుల సమన్వయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ గారు రథయాత్ర మహోత్సవంలో పాల్గొననున్న నేపథ్యంలో, ఆయన పర్యటనకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లను కూడా సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు, నిర్వాహకులకు సూచించారు. భక్తులందరూ ఎలాంటి అసౌకర్యం లేకుండా స్వామివారి దర్శనం, రథయాత్రలో పాల్గొనేలా అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇస్కాన్ గురువులు, ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ... రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి రాక తమకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. వేలాదిమంది భక్తుల సమక్షంలో శ్రీ జగన్నాథ స్వామివారి రథయాత్రను ధర్మవరం చరిత్రలో నిలిచిపోయే విధంగా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ఆలయ గురువులు, ఆలయ నిర్వాహకులు, సేవా బృంద సభ్యులు, భక్తులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మార్కెట్ యార్డులో అనధికార జోక్యానికి తావులేదు: వైస్ చైర్మన్ ఆదూరి విజయ్ కృష్ణ



ఆదోని, జులై 14 (అనంత ప్రభ)

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అనధికార వ్యక్తుల జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఆదూరి విజయ్ కృష్ణ స్పష్టం చేశారు. మార్కెట్ యార్డు పరిపాలన పూర్తిగా చట్టబద్ధంగా, పాలకమండలి నిర్ణయాలకు అనుగుణంగానే సాగుతుందని తెలిపారు. మార్కెట్ యార్డులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల జరిగిన సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొనడంపై కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. చైర్మన్ శారదను తాము ఎక్కడా అవమానించలేదని, ఆమె భర్త శంకర్ చేసిన వ్యాఖ్యలే ఆమె గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని అన్నారు. మార్కెట్ యార్డులో శంకర్‌కు ఎలాంటి అధికార హోదా లేదని, చైర్మన్ భర్త అనే పేరుతో పాలకమండలి వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది, పాలకమండలి సభ్యులు అధికార హోదా లేని వ్యక్తుల సూచనలను అనుసరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. లైసెన్స్ రెన్యువల్‌లు, కొత్త లైసెన్స్‌ల మంజూరులో అవకతవకలు జరిగాయనే ఫిర్యాదులు అందిన నేపథ్యంలో పూర్తి విచారణ జరిగే వరకు సంబంధిత అంశాలను పెండింగ్‌లో ఉంచినట్లు తెలిపారు. అవినీతికి ఆస్కారం కలిగించే నిర్ణయాలకు తాము ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ఇవ్వబోమన్నారు. రైతులు, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్ల ప్రయోజనాల పరిరక్షణే తమ లక్ష్యమని, మార్కెట్ యార్డును వ్యక్తిగత ప్రయోజనాల వేదికగా మార్చే ప్రయత్నాలను అడ్డుకుంటామని చెప్పారు. అధికార హోదా లేని వ్యక్తులు పరిపాలనలో జోక్యం చేసుకోవడం వెంటనే నిలిపివేయాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు కేందోలె రత్నాభాయి, రామకృష్ణ, శ్రీనివాస ఆచారి, కమిషన్ ఏజెంట్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి మహదేవ్, కార్యవర్గ సభ్యుడు గోపి తదితరులు పాల్గొన్నారు.

AP 4PG 15- 7- 2026 WEDNESDAYqxp_Layout 1 14-07-2026 08:54 PM Page 2



## అగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం



యాడికి, జూలై 14 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే వృద్ధాశ్రమంలో జొన్నగిరి ప్రాంతానికి చెందిన టీకే రంగన్న కుటుంబ సభ్యులు తమ మనవరాలు సాత్విక నామకరణ శుభ సందర్భంగా వృద్ధులు, నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 50 కిలోమీటర్ల దూరంలోని జొన్నగిరి నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన టీకే రంగన్న, మనోహరమ్మ, వారి కుమారుడు టీకే ఉదయ్‌కిరణ్, కోడలు వి. శ్రావణి తమ కుమార్తె సాత్వికకు పెద్దల ఆశీర్వాదాలు లభించాలని ఆకాంక్షిస్తూ ఆశ్రమవాసులకు ప్రేమతో భోజనాలు వడ్డించారు. వృద్ధులు, నిరాశ్రయులు నిండు మనసుతో చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీకే సుకుమార్, ప్రవీణ్, సాగర్, గణేష్, జాషువా, రేవంత్, చిన్న, ప్రవీణ్‌తో పాటు బంధుమిత్రులు, స్నేహితులు పాల్గొన్నారు. అనంతరం ఆశ్రమ వ్యవస్థాపకుడు బత్తల ప్రసాద్ కుటుంబ సభ్యులను అభినందించి, వారి సేవాభావాన్ని కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు.

## నాలుగు రోజులు రైల్వే గేట్ మూసివేత

యాడికి, జులై 14 (అనంత ప్రభ)

యాడికి మండల పరిధిలోని రాయలచెరువు సమీపంలోని రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ నెం.171 వద్ద ట్రాక్ భద్రత, నిర్వహణలో భాగంగా చెక్‌రైల్ రెన్యూవల్ పనులు చేపట్టనున్నట్లు సౌత్ కోస్ట్ రైల్వే అధికారులు తెలిపారు. ఈ పనుల దృష్ట్యా జులై 16 నుంచి 19వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు లెవెల్ క్రాసింగ్ గేట్ పూర్తిగా మూసివేయనున్నట్లు వెల్లడించారు. పనుల సమయంలో రాయలచెరువు,వేములపాడు, పెద్దపేట బైపాస్ రహదారి మీదుగా వాహనాల రాకపోకలను వినియోగించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని రైల్వే అధికారులు విజ్ఞప్తి చేశారు

## రైతు ఇంటికే భరోసా.. పొలంలోకే చేరిన ఎమ్మెల్యే



ఆదోని, జులై 14 (అనంత ప్రభ)

ఆదోని మండలం ఆరెకల్ గ్రామ పరిధిలోని వ్యవసాయ పొలాలను ఎమ్మెల్యే డా. పీవీ పార్థసారథి మంగళవారం సందర్శించి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి పంట బీమా పథకం కింద ప్రతి రైతు తప్పనిసరిగా పంట బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. వాతావరణ మా-ర్పులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పంటలకు నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నందున బీమా రైతులకు ఆర్థిక రక్షణ కల్పిస్తుందని తెలిపారు. పంట బీమా నమోదుకు చివరి గడువు సమీపించడంతో జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత బ్యాంకుల మేనేజర్లతో కూడా మాట్లాడి అర్హులైన ప్రతి రైతు నమోదు చేసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని ఆదేశించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రతి రైతు పంట బీమా అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాల నుంచి ఆర్థిక భద్రత పొందాలని కోరారు.

## చిన్నయల్లంపల్లిలో క్షుద్ర పూజల కలకలం



కదిరి, జులై 14 (అనంత ప్రభ)

కదిరి నియోజకవర్గం నల్లచెరువు మండల పరిధిలోని చిన్నయల్లంపల్లి గ్రామంలో సాతర్ల మోహన్ కుమార్ ఇంటి కాంపౌండ్ లో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో ఎవరూ లేని సమ-యంలో క్షుద్ర పూజలు చేశారు. సాతార్ల మోహన్ కుమార్ కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూడగా క్షుద్ర పూజలు చేసినా ఆనవాళ్లను చూసి భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆపదలో అండగా, అంతిమయాత్రకు తోడుగా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్



యాడికి, జూలై 14 (అనంత ప్రభ)

ఆపదలో ఉన్నామని సమాచారం అందగానే స్పందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటోంది యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్. అంత్యక్రియలు నిర్వహించేందుకు దిక్కులేని కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా భావాన్ని మరోసారి చాటుకుంది. యాడికితో పాటు నంద్యాల జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో ఫౌండేషన్ సభ్యులు స్వయంగా వెళ్లి అంత్యక్రియలు నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారు. యాడికి మండల కేంద్రంలోని లాలెప్ప కాలనీకి చెందిన చింతా రమణ (ఎల్ఐసీ రమణ) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భాను ప్రతాప్ అనే కుమారుడు ఒక్కరే ఉండగా, తండ్రి అంత్యక్రియలను ఒంటరిగా నిర్వహించలేక మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్‌ను ఆశ్రయించాడు. సమాచారం అందుకున్న సభ్యులు వెంటనే అక్కడికి చేరుకుని అన్ని ఏర్పాట్లు చేసి గౌరవప్రదంగా అంత్యక్రియలు పూర్తి చేశారు. అదేవిధంగా నంద్యాల జిల్లా గోర్విమానిపల్లె గ్రామానికి చెందిన వై. లక్ష్మీదేవి మృతి చెందగా, ఆమెకు ఐదుగురు కుమార్తెలు మా-త్రమే ఉండడంతో అంత్యక్రియలు నిర్వహించే పరిస్థితి లేక ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. వెంటనే యాడికి నుంచి గోర్విమానిపల్లెకు చేరుకున్న సభ్యులు వారి సంప్రదాయ పద్ధతిలోనే అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. క్లిష్ట సమయంలో తమకు అండగా నిలిచి అంతిమ సంస్కారాలు నిర్వహించిన మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులకు మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమంపై స్థానికులు ప్రశంసలు కురిపించారు

## డెంగ్యూపై విద్యార్థులకు అవగాహన, గర్భిణులకు ఆరోగ్య సూచనలు



యాడికి, జులై 14 (అనంత ప్రభ)

జిల్లా మలేరియా అధికారి డి ఓబులు ఆదేశాల మేరకు యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి పర్యవేక్షణలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డెంగ్యూ జ్వరంపై అవగాహన కల్పించి, నివారణ చర్యలను వివరించారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, కాన్పుల కోసం తప్పనిసరిగా 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలని, హైరిస్క్ గర్భిణులు ముందుగానే ఆసుపత్రిలో చేరాలని సూచించారు. అనంతరం ల్యాబ్‌ను పరిశీలించి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించడంతో పాటు, జ్వరంతో వచ్చే ప్రతి రోగికి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా తదితర రక్త పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ శోభకుమారి, మేల్ సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్, ఎంపీహెచ్ఎం మద్దిలేటి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## శింగనమల మండల స్థాయి అనంత ఛాంపియన్‌షిప్‌లో జెడ్పీహెచ్ఎస్ పెరవలి విద్యార్థుల ప్రతిభ



శింగనమల, జులై 14 (అనంత ప్రభ)

ఆకులేడు ఉన్నత పాఠశాలలో ఈరోజు నిర్వహించిన శింగనమల మండల స్థాయి అనంత ఛాంపియన్‌షిప్ పోటీలలో జెడ్పీహెచ్ఎస్ పెరవలి విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు.

అండర్-14 ఖోఖో బాలుర విభాగంలో జెడ్పీహెచ్ఎస్ పెరవలి జట్టు విజేతగా నిలిచి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. అలాగే అండర్-14 ఖోఖో బాలికల విభాగంలో జెడ్పీహెచ్ఎస్ పెరవలి జట్టు ఫైనల్ వరకు చేరి రన్నర్స్‌గా నిలిచి ప్రశంసలు అందుకుంది.

ఈ సందర్భంగా విజేతలు, రన్నర్స్‌గా నిలిచిన క్రీడాకారులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహా రెడ్డితో కలిసి శింగనమల మండల ఎంపీడీఓ భాస్కర్, మండల విద్యాశాఖ అధికారి (వీజూ) నరసింహరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందరాజులు అభినందించారు. క్రీడాకారులు జిల్లా స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాల, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు

## ఎస్టీ హోదా సాధనకు కోసిగిలో వాల్మీకి బోయల చైతన్య సదస్సు

### -- మంత్రాలయం జనసేన పార్టీ ఇన్‌చార్జి వాల్మీకి బి. లక్ష్మన్న పిలుపు



మంత్రాలయం, జులై 14 (అనంత ప్రభ)

వాల్మీకి బోయలకు ఎస్టీ హోదా సాధనే లక్ష్యంగా ఈ నెల 26న కోసిగిలో నిర్వహించనున్న వాల్మీకి బోయల చైతన్య సదస్సును రాజకీయాలకు అతీతంగా విజయవంతం చేయాలని మంత్రాలయం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి, రాష్ట్ర ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వాల్మీకి బి. లక్ష్మన్న పిలుపునిచ్చారు.

మంగళవారం మంత్రాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వాల్మీకి బోయలకు ఎస్టీ హోదా కోసం నాలుగు దశాబ్దాలుగా ఉద్యమాలు, చైతన్య సదస్సులు, సింహగర్జనలు, నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆ ఉద్యమాల ఫలితంగానే 2014--19 మధ్య రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్టీ బిల్లును ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపిందన్నారు. ప్రస్తుతం ఆ బిల్లు కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో పెండింగ్‌లో ఉందని చెప్పారు.

ఇటీవల మాధవరం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలిసి ఎస్టీ బిల్లుపై చర్చించామని, కేంద్ర ప్రభుత్వ స్థాయి-ంలో బిల్లును ఫాలోఅప్ చేసి వాల్మీకి బోయలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు లక్ష్మన్న తెలిపారు.

అనంతరం రాష్ట్ర నాయకుడు, మాజీ జెడ్పీటీసీ రాంభీమనాయుడు, డివిజన్ నాయకులు గణేకల్లు పరమేష్, వగరూరు వెంకటరాముడు, ఎమ్మిగనూరు బీటీ లక్ష్మన్న తదితరులతో సమావేశమై ఈ నెల 26న కోసిగిలో వాల్మీకి బోయల చైతన్య సదస్సు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

వాల్మీకి బోయల హక్కుల సాధన ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాజకీయాలకు అతీతంగా సమాజంలోని ప్రతి ఒక్కరూ చైతన్య సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. “పోరాడితే పోయేదేమీ లేదు... బానిస సంకెళ్లు తప్ప” అనే నినాదంతో వాల్మీకి బోయ సమాజం ఐక్యంగా ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు







## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కి మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహణ



ఆత్మకూరు, జూలై 14 (అనంత ప్రభ)

ఆత్మకూరు మండల పరిధిలోని పంపనూరు గ్రామంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కి మంగళవారం సంధర్భంగా ఆలయ కమిటీ స్వామి వారికి పాలాభిషేకం పంచామృత అభిషేకం, అలంకరణ,ఆకుపూజ ,అర్చన మహానైవేద్యం , మహామంగళహారతి, పల్లకి సేవ మరియు రాహు కాలం పూజలో భాగంగా కుజదోష కాలసర్పదోష సర్పదోష నివారణ కొరకు “శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూల మంత్ర బీజాక్షర హోమము” నిర్వహించడమైనది. ఈ కార్యక్రమాలలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బి బాబు తెలిపారు. అలాగే భక్తులు స్వామివారి అభిషేకం మరియు హోమము నందు పెద్ద ఎత్తున పాల్గొనడమైనది.

## ఎల్‌నినో ప్రభావం.. రైతులకు పంటల బీమాయే భరోసా: వైకుంఠం జ్యోతి



ఆలూరు, జులై 14 (అనంత ప్రభ)

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు అప్రమత్తంగా ఉండి తప్పనిసరిగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతి కోరారు. ప్రకృతి వైపరీత్యాలు, అనావృష్టి, వర్షాభావం వంటి పరిస్థితుల్లో రైతులను ఆర్థికంగా ఆదుకునే ముఖ్యమైన భరోసా పంటల బీమా మాత్రమేనని ఆమె తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకొని గడువులోగా ప్రీమియం చెల్లించి తమ పంటలకు రక్షణ కల్పించుకోవాలని సూచించారు. కాటన్ (పత్తి) ఎకరాకు ₹2,000, గ్రౌండ్‌నట్ (వేరుశెనగ) ఎకరాకు ₹500, ఉల్లి ఎకరాకు ₹90, రెడ్ చిల్లీ (ఎండు మిర్చి) ఎకరాకు ₹140, కందులు ఎకరాకు ₹44 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా అమలవుతున్న పంటల బీమా పథకాన్ని ప్రతి రైతు తప్పనిసరిగా వినియోగించుకొని భవిష్యత్తులో ఎదురయ్యే నష్టాల నుంచి రక్షణ పొందాలని వైకుంఠం జ్యోతి విజ్ఞప్తి చేశారు

## ఎస్ఐఆర్ లక్ష్య సాధనకు కృషి చేసిన సిబ్బందిని అభినందించిన లలితవ



ఆదోని, జులై 14 (అనంత ప్రభ)

ఆదోని మున్సిపాలిటీ 35వ వార్డు అమరావతి నగర్ సచివాలయ కార్యాలయంలో మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ అధ్యక్షతన ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఏఆర్వో రాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌ల వారీగా తొలగించిన ఓట్ల వివరాలను పరిశీలించిన లలితమ్మ, ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు విజయవంతంగా పూర్తి చేయడంలో కృషి చేసిన సచివాలయ సిబ్బందిని అభినందించారు. అడ్మిన్ నాగబాబు, సిబ్బంది హరిప్రసాద్, అపర్ణ, శ్రీరాములు, సూపర్‌వైజర్ నిఖిల్ ఒత్తిళ్లు, సవాళ్లను ఎదుర్కొంటూ ఓటరు జాబితా తయారీలో సమర్థవంతంగా పనిచేశారని కొనియాడారు. వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అమరావతి నగర్ టీడీపీ ఇన్‌చార్జి మహమ్మద్, బీజేపీ నాయకులు వెల్లాల మధుసూధన శర్మ, పరుశు రాం, రఫీక్, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్యామల, శాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం

కదిరి, జులై 14 (అనంత ప్రభ)

కదిరిలోని ఎస్.టి.ఎస్.ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంయుక్త విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక అవగాహన సదస్సు సోమవారం ఘనంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమం లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-4, రైల్వే, బ్యాంకింగ్, పోలీస్, రక్షణ రంగ ఉద్యోగాల గురించి సమగ్ర వివరణ ఇచ్చారు.

సిలబస్, పరీక్షా విధానం, ప్రిపరేషన్ వ్యూహాలు, టైమ్ మేనేజ్‌మెంట్, ముఖ్యమైన అంశాలపై మరియు ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌కు అనుగుణంగా అవసరమైన స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు.

AP 4PG 15- 7- 2026 WEDNESDAYqxp_Layout 1 14-07-2026 08:54 PM Page 3











## తలకాయ కూర వండడం రావడం లేదా? ఇలా అయితే సింపుల్



తలకాయ కూర మటన్ విభాగం కిందకే వస్తుంది. మేక, గొర్రెల తలలతోనే ఈ కూరను వండుతారు. అందుకే మటన్ తినడం వల్ల కలిగే లాభాలన్నీ ఈ కూర తిడనం వల్ల కలుగుతాయి. మటన్లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి మహిళలు అధికంగా తింటే మంచిది. వీరికి రక్తహీనత సమస్య అధికంగా ఉంటుంది. ఈ మటన్లో బి విటమిన్లు అధికంగా లభిస్తాయి.గర్భిణులు మటన్ తినడం వల్ల పుట్టబోయే బిడ్డకు చాలా లాభాలు కలుగుతాయి. మటన్లో ఉండే పొటాషియం రక్తపోటు, గుండెజబ్బులు, కిడ్నీ సంబంధ వ్యాధులు రాకుండా కాపాడతాయి. ఇందులో ఉండే కాల్షియం దంతాలు, ఎముకల గట్టిదనానికి సహకరిస్తాయి. తలకాయ కూర సులువుగా ఎలా వండాలో చూడండి.

%కావాల్సిన పదార్థాలు

తలకాయ మాంసం - అరకిలో
ఉల్లిపాయ - ఒకటి
అల్లం వెల్లుల్లి పేస్టు - రెండు స్పూన్లు
కారం - ఒక స్పూను
పసుపు - ఒక స్పూను
గరం మసాలా - ఒక స్పూను
కొత్తమీరు తరుగు - నాలుగు స్పూనులు
ధనియాల పొడి - ఒక స్పూను
ఉప్పు - రుచికి సరిపడా
కొబ్బరి తురుము - ఒక స్పూను
మిరియాల పొడి - అరస్పూను
(కొబ్బరి తురుము మీకు నచ్చితే వేసుకోవచ్చు. వేయకపోయినా రుచి బాగానే ఉంటుంది)

తయారీలో ఇలా

1. తలకాయ కూరను బాగా కడిగి పెట్టుకోవాలి.
2. ఉల్లిపాయలు నిలువుగా సన్నగా తురమాలి. స్టవ్ పై కుక్కర్ పెట్టి అందులో నూనె వేయాలి.
3. నూనె వేడెక్కాక ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించాలి.
4. అల్లం వెల్లుల్లి పేస్టు కూడా వేయించాలి. పసుపు, కారం కూడా కలపాలి.
5. అందులో తలకాయ కూర వేసి మూత పెట్టి రెండు విజిల్స్ వచ్చేదాకా ఉడికించాలి.
6. స్టవ్ మీద మరో కళాయి పెట్టి కుక్కర్లోని కూరను ఇందులోకి మార్చాలి.
7. ఉప్పు కూడా వేసి కాసేపు ఉడికించాలి.
8. ముక్క 90 శాతం ఉడికిపోయాక మిరియాల పొడి, ధనియాల పొడి, గరం మసాలా, కొబ్బరి తురుము వేసి ఉడికించాలి. అప్పటికే కూర బాగా ఉడికి మంచి వాసన వస్తుంది.
9. స్టవ్ కట్టేశాక పైన కొత్తిమీర చల్లి సర్వ్ చేయాలి. నాన్ వెజ్ ప్రియులెందరికీ తలకాయ కూరంటే ప్రాణం. ప్రత్యేకంగా వండుకుని తింటారు. ఇలా వండుకుని తింటే చాలా టేస్టీగా ఉంటుంది.

## బేకింగ్ సోడాతో ఇలా చేస్తే ఫర్నీచర్‌పై మరకలు పోతాయి



ప్రతి ఇంట్లోనూ ఫర్నీచర్ ఉంటాయి. సోఫా, మ్యాట్రెసెస్, చైర్స్ ఇలా చాలా రకాలు ఉంటాయి. వీటిని క్లీన్ చేసేందుకు చాలా టిప్స్ పాటించాలి. దీని వల్ల సోఫాలు చక్కగా క్లీన్ అవుతాయి. మరి అలా ఎఫెక్టివ్‌గా ఎలా దులపాలో ఇప్పుడు చూద్దాం.

ముందుగా మ్యాట్రెసెస్, సోఫా ఇంట్లోని సోఫాని ముందుగా దుమ్ముపోయేలా పొడి గుడ్డతో దులపండి. ఇంట్లో వాక్యూమ్ క్లీనర్ ఉంటే దానిని కూడా వాడొచ్చు.

దుమ్ము దులిపేటప్పుడు కేవలం ఫర్నీచర్ ముందుగానే కాకుండా, మూలలు, వెనకాల మొత్తంగా పూర్తిగా దులపండి.కొన్నింటికి పాకెట్స్ ఉంటాయి. వాటిని కూడా చక్కగా క్లీన్ చేయండి.

ఇప్పుడు గోరువెచ్చని నీటిలో కొద్దిగా వెనిగర్ వేసి అందులో క్లాత్‌ని ముంచి దానిని స్క్వీజ్ చేసి చక్కగా ఫర్నీచర్‌ని క్లీన్ చేయండి. దీని వల్ల ఫర్నీచర్ చక్కగా క్లీన్ అవుతాయి.
ఇత్తడి వస్తువులు కూడా..

ఇంట్లో ఇత్తడి వస్తువులు కూడా ఉంటాయి. ఇవి కూడా త్వరగా మసకబారిపోతాయి. వీటిని కూడా చక్కగా క్లీన్ చేసుకోవచ్చు. ఇందుకోసం అరకప్పు డిష్ వాష్, ఓ టీస్పూన్ ఉప్పు, కొద్దిగా పిండిని కలిపి వీటిపై చల్లి తేలిగ్గా క్లీన్ చేయొచ్చు. దీంతో వస్తువులు చక్కగా తెల్లగా మెరుస్తాయి.

ఉడ్ ఫర్నీచర్..

ఇక ఉడ్ ఫర్నీచర్‌ని తుడిచేందుకు పొడి వస్త్రాన్ని వాడండి. వీటిని మరింతగా మెరిసేలా చేయాలంటే వ్యాక్స్, పాలిష్ కూడా చేయొచ్చు.
వీటిమూలల్లో కర్పూరం, నాప్తలీన్ బాల్స్ వేయడం వల్ల అవి తేమని గ్రహించి పురుగు పట్టకుండా చూ-స్తాయి. కాబట్టి, రెగ్యులర్‌గా వీటిని చక్కగా ఇలా క్లీన్ చేసుకోవచ్చు.
అదే విధంగా, దుమ్మును క్లీన్ చేయాలంటే డిష్ వాష్ తీసుకుని నీటిలో కలిపి అందులో సాఫ్ట్ క్లాత్‌ని ముంచి బయటికి తీసి పిండి తడి గుడ్డతో ఫర్నీచర్‌ని రుద్దాలి.
తర్వాత పొడిగుడ్డతో తుడిచి వీటిని చక్కగా తుడవండి.
ఇలా క్లీన్ అయిన ఫర్నీచర్‌ని పూర్తిగా ఆరబెట్టండి.

పాతపాలిష్‌ని తొలగించడం..

కొన్ని వస్తువులు పాత పాలిష్‌తో చూడ్డానికి అంత బాగుండవు. వీటిని క్లీన్ చేయాలంటే.. ముందుగా కొద్దిగా టీ బ్యాగ్స్ తీసుకుని వేడినీటిలో వేసి డికాషన్ చేయాలి. ఇది గోరువెచ్చగా అయ్యే వరకూ ఉంచి గుడ్డపై దీనిని పోస్తూ కొద్దికొద్దిగా తుడవాలి. టీ నుంచి వచ్చే టానిక్ యాసిడ్ వుడ్‌ని క్లీన్ చేస్తుంది.
మరకలు దూరమవ్వాలంటే..

## పైనాపిల్ హల్వా, ఇలా చిటికెలో చేసేయచ్చు



పైనాపిల్ పేస్ట్రీలు, కేకులు అంటే ఎంతో మందికి ఇష్టం. వాటి ఫ్లేవర్ మనసును లాగేస్తుంది. ఇంట్లోనే చాలా తక్కువ సమయంలో సులువుగా పైనాపిల్ హల్వాను చేసుకోవడం ఇక్కడ చెప్పాం. ఇది రుచితో పాటూ ఎంతో ఆరోగ్యాన్ని అందిస్తుంది. పిల్లలకు చాలా నచ్చేలా ఉంటుంది దీని టేస్ట్. ఎలా చేయాలో చదవండి మరి.

కావాల్సిన పదార్థాలు

పైనాపిల్ ముక్కలు - రెండు కప్పులు
పంచదార - 200 గ్రాములు
కోవా - అర కప్పు
నెయ్యి - రెండు స్పూనులు
యాలకుల పొడి - ఒక టీస్పూను
జీడిపప్పులు - నాలుగు
కిస్‌మిస్‌లు - ఎనిమిది

తయారీ ఇలా

1. పైనాపిల్ పండ్లను చిన్న ముక్కలుగా కోసుకోవాలి.
2. ముక్కలు పొడిపొడిగా ఉండేలా చూసుకోవాలి. నీళ్లు ఉండకూడదు.
3. స్టవ్ పై కళాయి పెల్లి నెయ్యి వేయాలి. అందులో పైనాపిల్ ముక్కలను వేసి వేయించాలి.
4. ముక్కలు కాస్త వేగి మెత్తగా అవుతాయి. ఆ సమయంలో పంచదార, కోవా ముద్ద కూడా వేసి బాగా కలపాలి.
5. యాలకుల పొడి, జీడిపప్పులు తురుములు కూడా వేసి బాగా కలపాలి.
6. అంతా దగ్గరగా ముద్దలా అయ్యేదాకా కలియబెట్టాలి. స్టవ్ చిన్న మంట మీద ఉండేలా చూసుకోవాలి. లేకుంటే మాడిపోయే ప్రమాదం ఉంది. చివరగా కిస్‌మిస్‌లు చల్లి స్టవ్ కట్టేయాలి. అంతే టేస్టీ పైనాపిల్ హల్వా రెడీ అయినట్టే. మీరు వండుతున్నప్పుడే మంచి సువాసన వస్తుంది హల్వా.
7. ఒక ప్లేటులో పైనాపిల్ హల్వాను వేసి ముక్కలుగా కోసుకోవాలి.

తింటే ఎన్ని ప్రయోజనాలో...
పైనాపిల్ పండు కొయ్యడం కష్టమని చాలా మంది కొనడానికే ఇష్టపడరు. కానీ దాని వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఈ పండు ఒక్కసారి మూడు ముక్కల దాకా తినగలరు. ఆ తరువాత కొంచెం నాలుక పూసినట్టు అవుతుంది. అదే ఇలా హల్వా చేసుకుంటే ఎంతైనా తినేయగలరు. ఈ పండులో 85 శాతం నీరే. చక్కెర 13 శాతమే ఉంటుంది. వీటిలో %ూ, దీ, జ% విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. దీని తినడం వల్ల మూత్రపిండాల్లో రాళ్లు కూడా కరుగుతాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ పండుకు కాస్త తేనె రాసుకుని తింటే శక్తి పెరుగుతుంది. బరువు తగ్గాలనుకునేవారికి అనాస చాలా మేలు చేస్తుంది. ఈ పండు రసం గొంతు నొప్పిని తగ్గిస్తుంది. దీనిలో ఉండే పోషకాలు చర్మాన్ని మెరిపిస్తాయి. కంటి చూపును మెరుగుపరచడంలో కూడా ఇవి ముందుంటాయి.

## సమ్మర్‌లో మీ ఇల్లు ఇలా క్లీన్ చేస్తే అలర్జీలు దూరం..

ఇల్లు క్లీన్ చేయాలని అనుకుంటారు. కానీ, అనుకున్న విధంగా చాలా మంది క్లీన్ చేయలేరు. కిటికీలు, తలుపులు ఇలాంటివాటిని వదిలేస్తారు. అక్కడ దుమ్ము లేదని వదిలేస్తారు. కానీ, ఇది వదిలేసేంత ఈజీ కాదు. అక్కడ దుమ్ము పేరుకుపోయి ఇంటిని మురికిగా మారుస్తాయి.
ఇంట్లో దుమ్ము, ధూళి పేరుకుపోవడం వల్ల ధూళి పురుగులు ఆ ప్రాంతంలో స్థిరపడతాయి. ఇవన్నీ కూడా దుప్పట్లు, దిండ్లు, సోఫా, ఇలా వాడే వస-్తువుల్లోకి చేరతాయి. దీంతో అలర్జీలు వస్తాయి. కంటికి కూడా కనిపించని ఇలాంటి చిన్న పురుగులు ఉబ్బసం, అలర్జీలకు కారణమవుతాయి.

ఎండాకాలంలో ఎక్కువగా..

మిగతా రోజులతో పోల్చితే ఎండాకాలంలో ఎక్కువగా దుమ్ము ఉంటుంది. ఈ సమయంలో ఇంట్లో దుమ్ము పేరుకుపోతుంది. కాబట్టి, ఈ సమయంలో రెగ్యులర్‌గా క్లీన్ చేయడం మంచిది.

ఇలా కాకుండా ఉండేందుకు..

మీరు కిటికీలు, తలుపులని రెగ్యులర్‌గా క్లీన్ చేయండి. కర్టెన్స్ కూడా క్లీన్ చేయడం మంచిది.

చాలా మంది కార్పెట్స్ వాడతారు. దీనిపై చాలా వరకూ దుమ్ము ఉంటుంది. ఇవి అటు నుంచి బెడ్స్ దాకా చేరతాయి. కాబట్టి, వీటిని కూడా మీరు రెగ్యులర్‌గా క్లీన్ చేయాలి.

పెంపుడు జంతువులు ఉంటే..


ఇంట్లో పెంపుడు జంతువులు పిల్లులు, కుక్కుల, ఇలా కొన్ని జంతువులు ఉంటే వాటి బొచ్చులో చాలా రకాల సూక్ష్మ క్రిములు ఉంటాయని గుర్తుపెట్టుకోండి. అందుకోసం వాటిని ఎప్పటికప్పుడు స్నానం చేయించడం, వాటి బొచ్చుని కట్ చేయడం చేస్తుండాలి.

ఇన్ని చేసినా కొన్నిసార్లు దుమ్ము, సూక్ష్మ క్రిములు పూర్తిగా పోవు. ఎప్పటికప్పుడు క్లీన్ చేయడమే వీటిని దూరం చేయడానికి ముఖ్య మార్గం.

అదే విధంగా, చాలా మంది పరుపులు వాడతారు. వీటిని ఎలా మెంటెయిన్ చేయాలో తెలియదు. వాటి కోసం వాక్యూమింగ్, బెడ్‌షీట్స్ రెగ్యులర్‌గా క్లీన్ చేయండి. దీని వల్ల అలెర్జీ కారకాలని దూరం చేయొచ్చు. వీటిని మీరు మీకు ఫ్రీగా ఉన్న రోజు చేయొచ్చు. అయితే, చాలా మంది దీనిని ఆదివారం రోజున పెట్టుకుంటారు. దీంతో ఆ రోజు కూడా వర్క్ చేసిన ఫీల్ వస్తుంది. అలా కాకుండా రోజు ఓ పావు గంట వారం పాటు ఒక్కో రోజు ఒక్కో రూమ్ అన్నట్లుగా చేయండి. మీకు అలసట ఉండదు.

దుమ్ము దులిపేందుకు..

ఇంట్లోని దుమ్ము దులిపేందుకు మీరు వాక్యూమ్ క్లీనర్ వాడొచ్చు. లేని వారు పొడి బట్టని తీసి దులపొచ్చు. ఇది క్లీన్ చేసిప్పుడు మీరు మాస్క్ వేసుకోవడం మంచిది. ఆ తర్వాత మైక్రో ఫైబర్ క్లాత్, డస్టర్‌తో ఓ సారి డీప్ క్లీన్ చేస్తే మంచిది.



AP 4PG 15- 7- 2026 WEDNESDAYqxp_Layout 1 14-07-2026 08:54 PM Page 4



# టాలీవుడ్ డైరెక్టర్‌తో డేటింగ్ రూమర్స్? ఆ హీరోతో రిలేషన్‌లో ఉన్నానంటూ హీరోయిన్ ట్విస్ట్!





చిత్ర పరిశ్రమలో బ్యాచిలర్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్న నటీనటులంతా ఒక్కొక్కరిగా మ్యారేజ్ లైఫ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నా. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు ఈ ట్రెండ్ కొనసాగుతోంది. ఎప్పటి నుంచో ప్రేమాయణం సాగిస్తున్న అమ్మాయిలంతా తమ పార్టనర్స్, కాబోయే భర్తలను పరిచయం చేస్తున్నారు. తాజాగా ఈ లిస్ట్‌లోకి తమిళ నటి బ్రిగిదా సాగా ఎంట్రీ ఇచ్చారు. ఈ వివరాల్లోకి వెళితే..

తమిళనాడుకు చెందిన బ్రిగిదా సాగా.. తొలుత ఆహా కళ్యాణం అనే తమిళ సీరియల్‌లో పవి టీచర్‌గా బాగా ఫేమస్ అయ్యారు. ఈ పాపులారిటీతో సినీరంగం నుంచి ఆమెకు అవకాశాలు వచ్చాయి. 2019లో అయోగ్య అనే సినిమాతో వెండితెర మీదకి అడుగుపెట్టారు బ్రిగిదా. ఆ తర్వాత వర్మా, మాస్టర్ సినిమాలలో నటించారు. వెళన్, ఇరవిన్ నిజాల్, గరుగన్, కొజిపణ్ణై చెల్లాదురై, మార్గాన్, ఇడ్లీ కడాయ్, హాట్ స్పాట్ సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. సింధూరం, పెదకాపు పార్ట్ 1 సినిమాలతో తెలుగు వారిని కూడా ఆకట్టుకున్నారు.

అందరు హీరోయిన్ల మాదిరిగానే బ్రిగిదాపైనా పలు రూమర్స్ వచ్చాయి. ప్రధానంగా తెలుగు డైరెక్టర్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు ఫేమ్ శ్రీకాంత్ అడ్డాలతో బ్రిగిదా రిలేషన్‌లో ఉన్నారంటూ అప్పట్లో వార్తలు వైరల్ అయ్యాయి. తెలుగు, తమిళ ఇండస్ట్రీలలో వీరి వ్యవహారం చర్చనీయాంశమైంది. శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో తెరకెక్కిన పెదకాపు సినిమాలో బ్రిగిదా సాగా నటించారు. ఈ సమయంలో వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి ఇద్దరూ రిలేషన్‌లో ఉన్నట్లు గాసిప్స్ వైరల్ అయ్యాయి. అయితే ఇద్దరిలో ఎవరూ దీనిపై స్పందించలేదు.

కానీ తమిళ దర్శకుడు, నటుడు పార్థిబన్ అప్పట్లోనే బ్రిగిదా- శ్రీకాంత్ అడ్డాల వ్యవహారంపై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ మీడియాపై మండిపడ్డారు. ఇదంతా ఒట్టిదేనని, వీరిద్దరి మధ్య ఎలాంటి బంధం లేదని తేల్చేశారు. శ్రీకాంత్ సతీమణి రాగసుధను తానే కోలీవుడ్‌కి పరిచయం చేశానని, ఇలాంటి వాటిని ఆమె అస్సలు పట్టించుకోదేదని పార్థిబన్ తేల్చేశారు. దాంతో శ్రీకాంత్ అడ్డాల- బ్రిగిదాల రిలేషన్ వార్తలకు చెక్ పడింది. ఇద్దరూ ఎవరి సినిమాలతో వారు బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో బ్రిగిదా సాగా సైలెంట్‌గా షాకిచ్చారు. తాను ఒకరితో రిలేషన్‌లో ఉంటున్నానని, ప్రియుడితో ఉన్న ఫోటోను షేర్ చేశారు.

తమిళ నటుడు, యువ హీరో అనంత్ రామ్‌తో తాను రిలేషన్‌లో ఉన్నట్లు తాజాగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించారు బ్రిగిదా. నా చిన్నప్పుడు అందమైన ప్రేమకథలు కేవలం సినిమాలలో ఉంటాయేమో అనుకునే దానిని, కానీ జీవితం నా కోసం అద్భుతమైన, అందమైన కథ రాసింది. నా ఫిలిం జర్నీలో నా లాంటి అభిరుచులు, కలలు ఉన్న అనంత్ నాకు తారసపడ్డాడు. స్నేహంతో మొదలైన మా బంధం ఇప్పుడు ప్రేమ వరకు వచ్చింది. అంతేకాదు.. మేమిద్దరం ఐ లవ్ యూ అని చెప్పుకుని వదిలేసే రకం కాదంటూ బ్రిగిదా రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతుండగా.. సినీ ప్రముఖులు, అభిమానులు, సన్నిహితులు బ్రిగిదా- అనంత్ రామ్ జోడీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. త్వరలోనే గుడ్ న్యూస్ చెప్పాలంటూ ఆకాంక్షిస్తున్నారు. అనంత్ రామ్ కూడా చిన్నా చితకా సినిమాలలో ఇప్పుడిప్పుడే నిలదొక్కుకునే యత్నాల్లో ఉన్నాడు.




# హైదరాబాద్‌లో సల్మాన్ ఖాన్ సందడి.. నయనతార ఎంట్రీతో పెరిగిన అంచనాలు!




బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'ఎస్ఎజ63' షూటింగ్ ఈ వారమే హైదరాబాద్‌లో మొదలు కానుంది. ఈ భారీ షెడ్యూల్ కోసం దర్శకుడు వంశీ పైడిపల్లి ఇప్పటికే నగరంలోని కీలక లొకేషన్లను ఫైనలైజ్ చేశారు. సల్మాన్ రాక కోసం ఇక్కడి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బాలీవుడ్, టాలీవుడ్ కలయికలో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తమ నగరంలోనే ఇంత పెద్ద సినిమా షూటింగ్ జరుగుతుండటంతో స్థానిక సినీ ప్రియులు ఖుషీ అవుతున్నారు. షూటింగ్ షెడ్యూల్‌ను పక్కాగా ప్లాన్ చేసిన చిత్ర యూనిట్, ఈ వారాంతంలో పనులన్నీ పూర్తి చేసింది. ఈ సినిమా కోసం లేడీ సూపర్ స్టార్ నయనతార తన బిజీ కాల్ షీట్ నుంచి ప్రత్యేకంగా డేట్స్ కేటాయించారు. ఆమె రాకతో ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు మరింత స్టార్ వాల్యూ పెరిగింది. షూటింగ్ స్పాట్స్ దగ్గర ఫ్యాన్స్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులు కూడా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. హీరోయిన్ డేట్స్ విషయంలో ఉన్న సస్పెన్స్‌కు ఈ అప్‌డేట్‌తో తెరపడింది.

నగరంలోని ఐకానిక్ లొకేషన్లతో పాటు ప్రైవేట్ స్టూడియోల్లో భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించనున్నారు. దాదాపు మూడు వారాల పాటు ఈ షెడ్యూల్ కొనసాగనుంది. సల్మాన్ ఖాన్ లుక్ లీక్ అవ్వకుండా చిత్ర యూనిట్ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటోంది. సినిమా ఫస్ట్ హాఫ్‌కు ఈ షెడ్యూల్ వెన్నెముక లాంటిదని తెలుస్తోంది. ఇప్పటికే స్టంట్ కోఆర్డినేటర్లు, నటీనటులు హైదరాబాద్ చేరుకుని రిహార్సల్స్ మొదలుపెట్టేశారు. షూటింగ్ కోసం సిద్ధమైన నయనతార సల్మాన్ గ్లోబల్ స్టార్‌డమ్, వంశీ పైడిపల్లి మేకింగ్ స్టైల్ కలిసి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనున్నాయి. సౌత్ ఇండియన్ నేటివిటీ మిస్ అవ్వకుండా మేకర్స్ ప్రతి ఫ్రేమ్‌ను జాగ్రత్తగా డిజైన్ చేస్తున్నారు. సల్మాన్-నయనతార జోడీ మధ్య కెమిస్ట్రీ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ కాంబినేషన్ సౌత్ మార్కెట్‌లో సినిమాకు భారీ ఓపెనింగ్స్ తెచ్చిపెడుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. నయనతార ఈ ప్రాజెక్ట్‌లో ఉండటం దక్షిణాది రాష్ట్రాల్లో సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. లోకల్ టెక్నీషియన్లతో సందడి సినిమాకు పక్కా రీజినల్ ఫ్లేవర్ తీసుకురావడానికి చాలా మంది తెలుగు టెక్నీషియన్లు ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. వంశీ పైడిపల్లి ఈ చిత్రాన్ని అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో విజువల్ వండర్‌గా తీర్చిదిద్దుతున్నారు. స్థానిక టాలెంట్‌ను ప్రోత్సహించడం ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత.

# ఆల్ఫా బాక్సాఫీస్ రేస్ ప్రారంభం.. అడ్వాన్స్ బుకింగ్ రెస్పాన్స్ ఎలా ఉందంటే?




బాలీవుడ్ యువ హీరోయిన్లు ఆలియా భట్, శర్వరీ వాఘ్ తమ కొత్త సినిమా 'ఆల్ఫా'తో బాక్సాఫీస్ వద్ద యాక్షన్ మోత మోగించడానికి సిద్ధమయ్యారు. జూన్ 26, 27 తేదీల్లో విడుదలైన కొత్త ప్రోమోలు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. జులై 3న విడుదల కానున్న ఈ సినిమా కోసం దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో వస్తున్న ఈ చిత్రం ఒక సరికొత్త మలుపుగా నిలవనుంది.

ఈ సినిమాలో ఆలియా, శర్వరీ అత్యంత కఠినమైన పోరాట దృశ్యాల్లో నటించారు. ఒక సూపర్ స్పై పాత్ర కోసం ఆలియా భట్ ఎంతో కష్టపడి శిక్షణ తీసుకుంది. శర్వరీతో కలిసి ఆమె చేసే హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనున్నాయి. ముఖ్యంగా మహిళా ప్రధాన యాక్షన్ సినిమాలను ఇష్టపడే ఆడియన్స్‌ను ఈ చిత్రం భారీగా ఆకట్టుకోనుంది.

ఆల్ఫా అడ్వాన్స్ బుకింగ్ ట్రెండ్స్.. ఇండియా వైడ్ రిలీజ్ డీటెయిల్స్

జులై 3న థియేటర్లలో ఈ సినిమా సందడి మొదలుకానుంది. ఇప్పటికే బుక్‌మైషో, పీవీఆర్ వంటి యాప్స్‌లో అడ్వాన్స్ బుకింగ్ అలర్ట్స్ కనిపిస్తున్నాయి. ఫస్ట్ డే ఫస్ట్ షో టికెట్ల కోసం ఫ్యాన్స్ అప్పుడే పోటీ పడుతున్నారు. మెట్రో నగరాలతో పాటు టైర్-2 సిటీల్లోనూ ఈ సినిమాపై భారీ హైప్ కనిపిస్తోంది.

ఆలియా భట్ 'ఆల్ఫా' తెలుగు వెర్షన్.. ఏపీ, తెలంగాణ స్క్రీన్ అప్‌డేట్స్

తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సినిమా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. హిందీతో పాటు తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా భారీ ఎత్తున విడుదల కానుంది. హైదరాబాద్, వైజాగ్ వంటి నగరాల్లో ఐమాక్స్ , పీఎక్స్ఎల్ వంటి ప్రీమియం స్క్రీన్లలో ఈ సినిమాను వీక్షించవచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రేక్షకులకు వరల్డ్ క్లాస్ విజువల్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ప్లాన్ చేస్తున్నారు.

ఆల్ఫా యాక్షన్ డిజైన్.. స్పై యూనివర్స్‌లో సరికొత్త ప్రయోగం

పఠాన్, టైగర్ సిరీస్ వంటి బ్లాక్ బస్టర్ సినిమాల బాటలోనే 'ఆల్ఫా' కూడా రూపొందింది. అయితే, మహిళా స్పైల కోణంలో కథను నడిపించడం ఈ సినిమా ప్రత్యేకత. భారీ బడ్జెట్, విదేశీ లొకేషన్లు, ఖరీదైన స్టంట్స్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ ఏడాది గ్లోబల్ లెవల్లో స్పై జానర్ సినిమాలకు ఈ చిత్రం కొత్త ఊపునిస్తుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆల్ఫా ఇన్‌స్టాగ్రామ్ ప్రోమోలు.. అప్‌డేట్స్ మిస్ అవ్వకండి

మంచి సీట్లు మిస్ అవ్వకుండా ఉండాలంటే డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో టికెట్ రిమైండర్లు సెట్ చేసుకోవడం మంచిది. లేటెస్ట్ అప్‌డేట్స్, సాంగ్ రిలీజ్ వివరాలు, బిహైండ్ ది సీన్స్ వీడియోల కోసం ఆలియా భట్ అఫీషియల్ ఇన్‌స్టాగ్రామ్ పేజీని ఫాలో అవ్వండి. సినిమా రిలీజ్ కంటే ముందే ఎక్స్‌క్లూజివ్ విషయాలను తెలుసుకోవడానికి ఇది ఫ్యాన్స్‌కు మంచి అవకాశం.

# ది బాయ్ మూవీ రివ్యూ అండ్ రేటింగ్

మర్డర్ కేసులో జైలు శిక్ష అనుభవించిన మేరి లుకా (ఫర్జానా పాలథింగల్) జైలులోనే బిడ్డకు జన్మనిస్తుంది. శిక్షాకాలం పూర్తయిన తర్వాత కొడుకు వాసుదేవ్ (ఆదిశేషన్ కేఆర్)తో కలిసి బయటకు వస్తుంది. తమ ఐడెంటిటీ గురించి తెలియకుండా జాగ్రత్త పడుతూ పలు ప్రదేశాల్లో తలదాచుకొనే ప్రయత్నం చేస్తుంది. ఆ క్రమంలో ఓ వృద్ధురాలి సంరక్షణగా చేరుతుంది. అయితే తన కుటుంబానికి దూరంగా బతుకుతున్న వృద్ధురాలి కోరిక మేరకు చనిపోయిన తర్వాత ఆమె పార్థీవ దేహాన్ని తన ఇంటిలోనే పాతిపెడుతుంది. ఈ విషయం తెలుసుకొన్న కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మేరిని అరెస్ట్ చేస్తారు. ఆ సమయంలో వాసుదేవ్ స్కూల్ వెళ్లడంతో తల్లి నుంచి విడిపోతాడు

మేరీ లుకా ఏ పరిస్థితుల్లో హత్య కేసులో ఇరుక్కొన్నది? మారు పేర్లతో తల్లి కొడుకులు ఎందుకు రహస్య జీవితాన్ని కొనసాగించారు? తమ గతం గురించి కొడుకు ఎలాంటి కథలు చెప్పింది? తల్లికి కొడుకు ఎలా అండగా నిలుస్తాడు? తల్లితో విడిపోయిన తర్వాత వాసుదేవ్ పరిస్థితి ఏమిటి? వాసుదేవ్ ఎలా పెరిగాడు? తల్లిని వెతకడానికి ఎలాంటి ప్రయత్నాలు చేశాడు? తల్లి ఆచూకీ కోసం ఎవరెవర్నీ కలిశాడు? వాసుదేవ్ లైఫ్‌లో అబ్బాస్ (టొవినో థామస్) పాత్ర ఏమిటి? తల్లి, కొడుకు ఎలా కలిశారు? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా కథ.

తల్లి, కొడుకుల రహస్య ప్రయాణం, ఐడెంటిటీ తెలియకుండా జాగ్రత్త పడటమనే అంశాలతో కథ చాలా స్లోగా సాగుతుంది. ఈ సినిమా సన్నివేశాల్లో డీటెయిలిటీ ఎక్కువ కావడంతో సినిమా కొంత డాక్యుమెంటరీ టచ్ అనిపిస్తుంది. కాకపోతే 70 ఏళ్ల వృద్ధురాలి క్యారెక్టర్ కథలోకి వచ్చిన తర్వాత కొంత ఫన్‌తో సాగడం ఫీల్‌గుడ్‌గా అనిపిస్తుంది. తల్లి, కొడుకులు విడిపోయిన తర్వాత స్టోరీలో ఎమోషన్స్, సెంటిమెంట్ అంశాలు ఎలివేట్ అయ్యేలా చిదంబరం సినిమాను తెరకెక్కించారు. టొవినో థామస్ అతిథి పాత్రలో కనిపించినప్పటికీ.. సినిమా కథకు అంతగా ఉపయోగపడేలా కనిపించదు. కాకపోతే భావోద్వేగంతో సాగే సినిమాగా ఓ హానెస్ట్ అటెంప్ట్ కనిపిస్తుంది. పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న సినిమాగా హృదయాలను టచ్ చేస్తుంది. ఈ సినిమాను కొంత ఓపికగా చూడాల్సిన పరిస్థితి ఉంటుంది.

నటీనటుల పెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. ఫర్జానా, ఆదిశేషన్ ఇద్దరు మాత్రమే సినిమాను నిలబెట్టారని చెప్పవచ్చు. వారు తమ పాత్రల్లో జీవించడంతో ప్రతీ సన్నివేశం బాగా పండింది. డిఫరెంట్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌ను ఫర్జానా చాలా సులభంగా, అలవోకగా పోషించారు. చిన్నవాడైనా పిల్లాడు తన వయసుకు మించిన పరిణతితో ఆకట్టుకొన్నారు. మిగితా పాత్రల్లో కనిపించిన వారు తమ క్యారెక్టర్ల డెప్త్ మేరకు ఫర్వాలేదనిపించారు. ఈ సినిమాకు ప్రధానంగా సినిమాటోగ్రఫి, మ్యూజిక్ పూర్తిస్థాయిలో సపోర్టుగా నిలిచాయి. బ్యాక్ గ్రౌండ్ స్కోరు సన్నివేశాలను ఎమోషనల్‌గా మార్చాయి. ఆటవీ ప్రాంతం, గ్రామీణ ప్రాంతంలో సాగే సినిమా కావడంతో పల్లె, అడవి అందాలను చక్కగా కెమెరాలో బంధించారు. సాధారణంగా భారీ బడ్జెట్ సినిమాలను రూపొందించే కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ తొలి ప్రయత్నంగా కంటెంట్ ప్రధానమైన సినిమాతో రావడం కొంత ఆశ్చర్యం కలిగిస్తుంది. అయితే మంచి ఉన్నత నిర్మాణ విలువలతో ఈ సినిమాను అందించారు. చైల్డ్ డ్రామా, మదర్, సన్ రిలేషన్స్, సైకాలజీ సర్వైవల్ థ్రిల్లర్స్ చూడాలనుకొనే వారికి బాలన్: ది బాయ్ చక్కటి ఆప్షన్. కాకపోతే కొంత ఓపికగా చూస్తే మంచి అనుభూతి కలుగుతుంది.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com